
సాక్షి
ఒడిశా
గురువారం । 1 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,34,235
బంగారం	12 గ్రాముల 550 మిల్లీ గ్రాములు
వెండి	60 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

\- భువనేశ్వర్/పూరీ

బడ్జెట్‌తో బతుకులు మారుతాయి



రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజల బతుకులు మారుతాయని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు.

- 8లో

అధ్వానంగా కెరండిగుడ రహదారి



రాయగడ జిల్లాలో బిసంకటక్ సమితి చంచాడగుడ పంచాయతీలోని కెరండిగుడ గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది.

- 8లో

న్యూస్‌రీల్

మెడ్‌పేస్‌కు ఎంపికైన సెంచూరియన్ విద్యార్థి



అనామ్ నవాజ్

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీకి చెందిన విద్యార్థి అనామ్ నవాజ్ యునైటెడ్ కింగ్‌డమ్ దేశంలో మెడ్‌పేస్ కంపెనీలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయ్యారు. వర్సిటీలో ఫైటో ఫార్మాసూటికల్స్ పూర్తి చేసిన అతనికి వార్షిక వేతనం రూ.54 లక్షలు లభించనుందని వర్సిటీ ఉపాధ్యక్షుడు డి.ఎన్.రావు తెలియజేశారు. రిజిస్ట్రార్ డా.అనితాపాత్రో తదితరులు అభినందనలు తెలిపారు.

తప్పించుకు తిరుగుతున్న ఖైదీ అరెస్టు



అరెస్టైన కున్నా సింగ్

పర్లాకిమిడి: జిల్లాలోని ఆర్.ఉదయగిరిలో ఒక పోస్కో కేసులో 2014 నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడు కున్నా సింగ్ పర్లాకిమిడిలో బుధవారం పట్టుబడినట్లు సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద్ నాయక్ తెలిపారు. తప్పించుకొని తిరగడం వలన నిందితుడిపై ఇంతవరకు చార్జిషీటు గానీ ట్రయల్ కేసు జరగలేదని ఆర్.ఉదయగిరి ఐఐసీ సవ్యసాచి మల్లా తెలియజేశారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు



నాటుసారాతో అరెస్టైన వ్యక్తి

జయపురం: స్థానిక ఎక్సైజ్ అధికారులు నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి జయపురం సమితి ములసర గ్రామానికి చెందిన భగవాన్ హరిజన్‌గా పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాటుసారా రవాణాపై వచ్చిన సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జయపురం ఎక్సైజ్ విజిలెన్స్ విభాగ ఐఐసీ అధికారి రస్మీ రంజన్ నాయిక్ నేతృత్వంలో ఒక బృందం దాడులు జరిపారు. ఆ దాడిలో 30 లీటర్ల నాటుసారాతో భగవాన్ హరిజన్‌ను అరెస్టు చేశారు. అతడిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు.

మహిళలకు నృత్య పోటీలు



నృత్య పోటీల్లో పాల్గొన్నవారితో నిర్వాహకులు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో మహిళా క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు నృత్య పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీల్లో మొత్తం 20 మంది పాల్గొన్నారు. సంబల్‌పురి, కొరాపుటియా వంటి నృత్య అంశాలు ఆకర్షించాయి. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని జ్యోతి సంజిత, బి.అనూషలు, ద్వితీయ బహుమతి ధనలక్ష్మి పాత్రో, తృతీయ బహుమతి ప్రియంబదా పాల్‌లు గెలుపొందారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో భభ్యోగులాని ప్రథమ బహుమతి, బినితా నాయక్ ద్వితీయ, సునీత చంపంగి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సుజాత పాలో, సుశ్రీత దాస్‌లు వ్యవహరించారు.



To

The Hon'ble Chairman,
Rajya Sabha
Parliament House
New Delhi

Subject: Resignation from the Membership of Rajya Sabha

Respected Sir,

I do hereby tender my resignation from the membership of Rajya Sabha today i.e. 31st July, 2024. I have taken this decision consciously.

I express my gratitude to your goodwill for the opportunities given to me to raise issues of public importance in the House.

With profound regards.

Yours sincerely,
Mamata Mohanta
(Mamata Mohanta)



బీజేడీకి షాక్..!

- రాజ్యసభ ఎంపీ మమతా మహంత రాజీనామా
- పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా
- బీజేపీలో చేరే అవకాశం

భువనేశ్వర్: రాష్ట్రంలోని ప్రతిపక్ష బిజూ జనతా దళ్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ మమతా మహంత రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను రాజ్యసభ చైర్మన్ జయదీప్ ధన్‌ఖర్ ఆమోదించారు. మమతా మహంత ఏప్రిల్ 2020లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆమె 6 సంవత్సరాల పూర్తి పదవీ కాలం ముగియడానికి ఇంకా 18 నెలలు మాత్రమే మిగిలి ఉంది. ఆమె బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు.

బీజేపీ ఎత్తుగడ

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికలతో లోక్‌సభలో బిజూ జనతా దళ్ ఉనికిని కోల్పోయింది. ఎగువ సభలో పరపతితో చలామణి అయ్యేందుకు తాపత్రయ పడుతోంది. అయితే రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఏమాత్రం బలం లేని భారతీయ జనతా పార్టీ క్రమంగా బలం పుంజుకోవడం కోసం చీలిక పాలన (డివైడ్ అండ్ రూల్) వ్యూహంతో వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్ర శాసనసభలో ప్రస్తుతం బీజేపీ బలం పుంజుకోవడంతో రాజ్యసభలో రాష్ట్ర ప్రాతినిధ్యానికి మార్గం సుగమం అయింది. మమతా మహంత రాజీనామా చేయడంతో ఒడిశా నుంచి రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయింది. నిబంధనల మేరకు అతి త్వరలో ఉప ఎన్నిక నిర్వహణ తథ్యం. ఈ పరిస్థితిని సానుకూలంగా మలచుకోగలిగితే ఎగువ సభలో బీజేపీ బలం పుంజుకోవడంలో ఊపందుకుంటుంది. అదే సమయంలో బీజేడీ బలం ఒక స్థానంతో దిగజారి పరపతి మసకబారుతుంది.



To

Shri Naveen Patnaik,
President, Biju Janata Dal,
Bhubaneswar, Odisha.

Respected Sir,

I do hereby resign from the Primary Membership of Biju Janata Dal, today, i.e 31st July, 2024.

I sincerely express my gratitude to your goodwill for giving me an opportunity to serve the people of Mayurbhanj and also to take the cause of Odisha at the national level.

However, I feel that there is no requirement of the services of myself as well as my community in the Biju Janata Dal. Therefore, I have taken this hard decision in public interest.

I request you to accept my resignation.

Yours sincerely,
Mamata Mohanta
(Mamata Mohanta)

బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా లేఖ

ఆసక్తికరంగా రాజకీయాలు

మమత మహంత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా రాష్ట్రంలో ఆసక్తికరమైన రాజకీయ పరిణామాన్ని ఆవిష్కరించింది. అయితే మమత మహంతకు ఈ రాజీనామా ఎటువంటి ఊరట మిగుల్చుతుందో వేచి చూడాల్సిందే. లోగడ వరుసగా రెండు పర్యాయాలు బీజేపీ అభ్యర్థికి బీజేడీ మద్దతు ఇచ్చి ఎగువ సభలో ప్రాతినిధ్యం కల్పించింది. బీజేడీ అండతో గెలిపొందిన ఆ అభ్యర్థికి నరేంద్ర మోదీ కొలువులో కేబినెట్ హోదా లభించింది. ఆయనే ప్రస్తుత రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్. కాగా ఇప్పుడు రాష్ట్రంలో బీజేడీ డీలా పడిన అనతి కాలంలోనే పార్లమెంటులో ప్రాతినిధ్యం పతన దిశకు మల్లుతున్న పరిణామ సంకేతాలు లభిస్తున్నాయి. ఎన్నో ఆకస్మిక రాజకీయ విపత్కర పరిస్థితుల్ని అవలీలగా అధిగమించిన బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పార్టీ బలోపేతానికి ఎలా వ్యూహరచన చేస్తారోననే ఉత్కంఠ నెలకొని ఉంది. కాలమాన పరిస్థితుల ప్రభావంతో బీజేడీ భవిత అగమ్య గోచరంగా పరిణమించక ముందే బీజేడీ మేలుకోవాల్సి ఉంది.

విషాదం

- కేరళ ప్రమాదంలో ఒడిశా వైద్యుడి మృతి
- బిష్ణు ప్రసాద్ చిన్రా మృతదేహం లభ్యం
- మరో వైద్యుడి కోసం గాలింపు



డాక్టర్ బిష్ణు ప్రసాద్ చిన్రా



డాక్టర్ స్వాధీన్ పండా

భువనేశ్వర్: కేరళలోని వాయనాడ్‌లో విధ్వంసకర కొండ చరియలు విరిగిపడడంతో గల్లంతైన ఇద్దరు ఒడిశా వైద్యుల్లో ఒకరైన డాక్టర్ బిష్ణు ప్రసాద్ చిన్రా మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈ విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి ధ్రువీకరించారు. మృతదేహం గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం దిలీప్ రౌత్రాయ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని పంపింది. పరిశీలించిన తర్వాత మృతదేహాన్ని ఒడిశాకు తీసుకువస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి.

రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ) కేరళ విపత్తు నిర్వహణ అధికార వర్గాలతో తరచూ సంప్రదింపులు చేస్తున్నారు. అక్కడి ఒడియా అధికారులను కూడా సంప్రదించారు. ఇంకా చాలా మంది శిథిలాల కింద చిక్కుకున్నారని, సాయుధ బలగాలు సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయని తెలిపారు.

విహార యాత్రకు వెళ్లి...

సెలవుల్లో విహార యాత్రకు వెళ్లి డాక్టర్లు విషాదంలో చిక్కుకున్నారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు డాక్టర్లు భార్యలతో కలిసి వయనాడ్ పర్యటనకు వెళ్లారు. వారి భార్యల్లో ఒకరు నర్సింగ్ టీచర్ కాగా మరొకరు డాక్టరు. వీరివురు సహాయక బృందానికి చిక్కడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరిని ప్రాథమిక చికిత్స అనంతరం జనరల్ వార్డుకు తరలించారు. వారు త్వరగా కోలుకుంటారని వైద్య వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. దీనిపై మంత్రి సురేశ్ కుమార్ పూజారి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం బాధిత కుటుంబాలకు చేరుకుని తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాయి. అధికార వర్గాలు కుటుంబాలతో నిరంతర సంప్రదింస్తూ ఓదార్చుతున్నట్లు వివరించారు. గల్లంతైన మరో వైద్యుడిని త్వరలో గాలించి గుర్తిస్తామని బాధిత వర్గాలకు భరోసా ఇస్తున్నారు.

ఇదీ విషయం...

కటక్ జిల్లా చౌద్వార్‌కు చెందిన బిష్ణు ప్రసాద్ చిన్రా, తన భార్య ప్రియదారిణి పాల్, స్నేహితుడు డాక్టర్ స్వాధీన్ పండా మరియు అతని భార్య స్వీకృతి మహాపాత్రతో కలిసి విహారయాత్రకు వెళ్తుండగా సోమవారం రాత్రి కొండ చరియలు విరిగిపడ్డాయి. వీరంతా జూలై 26న బెంగళూరు నుంచి విహారయాత్రకు బయల్దేరారు. అక్కడి నుంచి కేరళలోని వాయనాడ్‌కు వెళ్లారు. వారు లినారా విల్లాలో బస చేశారు. దురదృష్టవశాత్తు సోమవారం రాత్రి మెప్పాడి, ముండక్కై టౌన్ మరియు చూరల్ మాల కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. కొండ చరియలు విరిగిపడిన తర్వాత బురద నీరు స్థానికంగా వివిధ జనావాస ప్రాంతాలను ముంచెత్తింది. ప్రియదర్శిని, స్వీకృతిని సహాయక బృందాలు రక్షించడంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అయితే వైద్యుడు స్వాధీన్ పండా ఆచూకీ తెలియాల్సి ఉంది.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకోండి



మంత్రి గోకులానందకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

కొరాపుట్: గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని జిల్లా ఎమ్మెల్యేలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో రాష్ట్ర పశు సంవర్ధక మంత్రి గోకులానంద మాలిక్‌ను బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజూ జిల్లా నుంచి వందలాది గోవులు తెలంగాణావైపు తరలించుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవులను పోలీసులు అడ్డుకున్నప్పటికీ వాటిని రక్షించడం అసాధ్యంగా మారిందన్నారు. అందుకే జిల్లాలో గోవుల పరిరక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, అక్రమ రవాణాలో స్వాధీనం చేసుకున్న గోవులను అక్కడికి తరలించి రక్షించాలన్నారు. మంత్రిని కలిసినవారిలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, జొరిగాం ఎమ్మెల్యే నర్సింగ బోత్ర, బీజేపీ నాయకుడు కనుదాస్‌లు ఉన్నారు.

రామ నామమే తలపంతా..!



అయోధ్య నుంచి శ్రీలంకకు పాదయాత్రగా వెళ్తున్న అయోధ్యకు చెందిన రామ్ సుందర్ దాస్ అనే వ్యక్తి బుధవారం మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆయన 2023 ఫిబ్రవరి 1వ తేదీన శ్రీలంకకు బయల్దేరారు. అప్పటి నుంచి శ్రీరాముడు వనవాసం చేసిన ప్రాంతాల్లో పర్యటించి పుణ్య స్థలాలను సందర్శిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని బొండఘాటీపై ఉన్న సీతాకూండ్, అలాగే అమ్మకూండ్ వంటి ప్రదేశాలు, మహా భరతంలో పాండవులు వనవాసం చేసిన ప్రాంతాలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. గురువారం మోటూ మీదుగా బయల్దేరి భద్రాచలం వెళ్లి, అక్కడ నుంచి పాదయాత్ర కొనసాగిస్తానని పేర్కొన్నారు.

\- మల్కన్‌గిరి

విద్యా వారోత్సవాలు ముగింపు



తిథి భోజనం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు విద్యార్థులకు తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాశ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్రాంత హెచ్‌ఎం సురేంద్ర పట్నాయక్, గౌరవ అతిథిగా స్కూల్ యాజమాన్య కమిటీ అధ్యక్షుడు జయంతి నాయక్‌లు పాల్గొన్నారు. పాత విద్యార్థులు పాఠశాలతో సంబంధాలు బలోపేతం చేయడమే తిథి భోజనం ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. పాత విద్యార్థులు కోరితే వారి జన్మదినం, వివాహ వేడుకలు, వారి పిల్లల జన్మదినాల్లో పాఠశాలలో తిథి భోజనాల కార్యక్రమం నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్ సచిన్ పవార్ తదితరులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి జగన్నాథ్‌పల్లి హైస్కూల్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి శిక్షణ మూడు రోజులుగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా చివరి రోజు బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా 72 యూనిట్ల రక్తం సేకరించారు. జిల్లా అగ్నిమాపక అధికారి కమల్‌లోచన్ గౌడ్ నేతృత్వంలో విపత్తుల సమయంలో ఎలా రక్షించవచ్చో వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ సచిన్ పవార్, ఎస్పీ నితీష్ వాద్వానీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సోమారి టాంగులు, రాష్ట్ర రెడ్‌క్రాస్ అధికారి లక్ష్మణ్ స్వాయి తదితరులు పాల్గొన్నారు.

మావో ప్రభావిత ప్రాంతాల్లో డీఐజీ పర్యటన



పోలీసు అధికారులతో చర్చిస్తున్న డీఐజీ మీనా

రాయగడ: మావో ప్రభావిత ప్రాంతమైన కల్యాణ సింగుపూర్‌లో దక్షిణాంచల్ డీఐజీ చరణ్ సింగ్ మీనా మంగళవారం పర్యటించారు. ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జిల్లాలో మావో వారోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రత్యేకత సంతరించుకుంది. ఎస్పీ హరీష్ బీసీ, ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతిలతో శాంతి భద్రతల విషయమై సుదీర్ఘంగా చర్చించారు. కల్యాణ సింగుపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన అధికారులతో సమీక్షిస్తూ చిన్న చిన్న సంఘటనల మినహా జిల్లాలో మావోల ప్రభావం తగ్గుముఖం పట్టిందన్నారు. అయితే మావో వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో వారి కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాయగడ, కొరాపుట్, మల్కన్‌గిరి, నువాపడ జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఉన్నట్లు వివరించారు. అయితే మావో కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలంటే అందుకు గ్రామాలకు రహదారులు, మౌలిక సౌకర్యాలు కల్పనతో పాటు మొబైల్ సేవలు మెరుగుపరడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు అన్ని ప్రాంతాలకు ఈ సౌకర్యాలు కల్పించడంతో ఆయా ప్రాంతాల్లో మావో కదలికలు కనుమరుగయ్యాయన్నారు. మరి కొన్నేళ్లలో ఈ ప్రాంతంలో మావో కదలికలు పూర్తిగా కనబడవని ధీమా వ్యక్తం చేశారు.

గంజాయితో పట్టుబడిన మహిళ



గంజాయితో పట్టుబడిన మహిళ

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్‌లో గంజాయితో ఒక మహిళ ఆర్‌పీఎఫ్ పోలీసులకు పట్టుబడింది. ఆమె నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. వివరాల్లోకి వెళ్తే.. జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఎప్పటిలాగే రైల్వే ప్లాట్‌ఫారంలో బుధవారం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మూడో నంబర్ ప్లాట్‌ఫారంలో ఒక మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమె బ్యాగును తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో అరెస్టైన మహిళను మధ్య ప్రదేశ్‌కు చెందిన పూజాసింగ్‌గా గుర్తించారు. అనంతరం ఆమెను కోర్టుకు తరలించారు.

అదేవిధంగా మంగళవారం రాత్రి నిర్వహించిన పెట్రోలింగ్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఒక వ్యక్తిని తనిఖీ చేయగా 18.100 కిలోల గంజాయి పట్టుబడింది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు గంజాయిని తరలించేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్తున్న జిల్లాలోని గుడారి సమితి జలనిధి గ్రామానికి చెందిన మనోజ్ పతిక అనే యువకుడు పట్టుబడినట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. నిందితుని నుంచి గంజాయితో పాటు రూ.2,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అధ్వానంగా కెరండిగుడ రహదారి



రహదారి నిర్మించినట్లు వేసిన శిలా ఫలకం



ప్రస్తుతం రహదారి పరిస్థితి

రాయగడ: జిల్లాలో బిసంకటక్ సమితి చంచాడగుడ పంచాయతీలోని కెరండిగుడ గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించేందుకు మనోరేగ పథకం కింద 2022–23లో రూ.5 లక్షల నిధులు కేటాయించారు. అనంతరం రహదారి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ సమీపంలోని మట్టిని తీసుకొచ్చి మట్టిరోడ్డు వేసి చేతులు దులుపుకున్నాడు. ప్రస్తుతం అసలే వర్షాకాలం కావడంతో వేసిన మట్టి రహదారి బురదమయమై కనీసం అడుగు వేసేందుకు ఇబ్బందిగా మారింది. తమ గ్రామానికి రహదారి సౌకర్యం మెరుగుపరచాలని స్థానికులు పలుమార్లు సమితి కార్యాలయంలోని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సేవలతో ఉద్యోగికి గుర్తింపు



సన్మాన సభలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జయపురం: సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు యజ్ఞేశ్వర పండ, నరేష్ కుమార్ షాడంగిలను పాఠశాలలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రకాశ చంద్ర పట్నాయక్ మాట్లాడుతూ.. యజ్ఞేశ్వర పండ కేవలం ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా జూనియర్ రెడ్‌క్రాస్ అధికారిగా విద్యార్థులకు క్రమశిక్షణ, సమాజ సేవపై అవగాహన కల్పించి ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అదేవిధంగా క్రీడా ఉపాధ్యాయుడిగా నరేష్ కుమార్ షాడంగి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వరంజన్ గౌడ, శుభస్మిత సాహు, పాపతి ప్రధాన్, రస్మిత నాహక్, ప్రభాత్ కుమార్ రౌత్, ఓం ప్రకాశ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సన్నాహాలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

జయపురం: సబ్ డివిజన్ స్థాయి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు స్థానిక మున్సిపల్ సభా గృహంలో సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు నిర్వహించాల్సిన పోటీలు, పెరేడ్ గ్రౌండ్‌లో ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్, సివిలియన్ ట్రూపులు నిర్వహించే కవాతు తదితర అంశాలపై చర్చించారు. జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ కార్య నిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, బీడీవో శక్తి మహంతి, పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి, సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి, జయపురం సబ్ డివిజన్ సమాచార ప్రజా సంబంధాల అధికారి యశోద గదబ, జయపురం తహసీల్దార్ డాక్టర్ మనోలిన ఆచారి, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు భాయి షాడంగి తదితరులు పాల్గొన్నారు.

కమలా పూజారికి నివాళులు



కమలా పూజారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: దివంగత పద్మశ్రీ కమలా పూజారికి అవిభక్త కొరాపుట్ భూమియా సమాజ్ సభ్యులు నివాళులర్పించారు. బుధవారం పాత్రోపుట్‌లోని కమల పూజారి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి అంజలి ఘటించారు. కార్యక్రమంలో జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి, సమితి బీడీవో శక్తి మహపాత్రో, అదనపు బీడీవో నోజ నాయిక్, ప్రభుత్వ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, భూమియ సమాజ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న సవర ప్రసాద్ మృతదేహం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెంటిభద్ర గిరిజన గ్రామానికి చెందిన సవర ప్రసాద్(35) మద్యం మత్తులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంగిలిగాం కాలనీ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడి నట్లు చెబుతున్నారు. ప్రసాద్‌కు భార్య యమున, కుమార్తె, కుమారుడు ఉన్నాడు. కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

దర్జాగా ఇసుక అక్రమ రవాణా



దూసి రైల్వేగేట్ సమీపంలో ఇసుక ట్రాక్టర్లు

ఆమదాలవలస: మండలంలో నాగావళి నదీతీరంలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా పట్టపగలే దర్జాగా సాగుతోంది. దూసిపేట, దూసి తదితర ప్రాంతాల నుంచి నిత్యం ట్రాక్టర్లతో ఇసుక తరలించుకుపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్‌తో బతుకులు మారుతాయి

- వికసిత్ ఒడిశా మా ధ్యేయం
- సీఎం మోహన్ చరణ్ మాఝి
- బడ్జెట్‌పై అసెంబ్లీలో ప్రసంగం



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన భారతీయ జనతా పార్టీ తొలిసారిగా సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్ర ప్రజల బతుకులు మారుతాయని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరపు బడ్జెటు ప్రతిపాదనలు, పథకాలు, కార్యక్రమాలు, కేటాయింపులపై విపక్ష నేత నవీన్ పట్నాయక్ లోతుగా విశ్లేషించి బీజేపీ పేరు మార్పిడి బడ్జెట్‌కు రంగు పూసిందని దుయ్యబట్టిన విషయం తెలిసిందే. బడ్జెటుపై చర్చ పురస్కరించుకుని విపక్ష నేత వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి బదులుగా తన వివరణని సభలో మంగళవారం సాయంత్రం వినిపించారు. ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ ఆధ్వర్యంలో గత బీజేడీ ప్రభుత్వం ఓటు బ్యాంకు కోసమే బడ్జెటులో పథకాలను ప్రతిపాదించేదని పేర్కొన్నారు. బీజేడీ హయాంలో ప్రవేశపెట్టిన అనేక కార్యక్రమాలు వాస్తవ కార్యాచరణలో విఫలమయ్యాయని ఆరోపించారు. బడ్జెటులో ప్రతిపాదించిన పలు పథకాలు, కార్యక్రమాలు అమలుకు ముందే బెడిసికొట్టిన దాఖలాలు లేకపోలేదని ఎద్దేవా చేశారు. అందుకే 24 ఏళ్ల బీజేడీ పాలనలో ఆశలు సన్నగిల్లిన తర్వాత మార్పు తీసుకురావాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం

ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఒడియా ఆత్మగౌరవం (అస్మిత)పై దృష్టి సారించి బీజేపీ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. నేమ్ ఛేంజర్ మరియు గేమ్ ఛేంజర్ ఎవరో ప్రతిపక్ష నేత తెలుసుకోవాలని హితవు పలికారు. సుపరిపాలనపై దృష్టి సారించకుండా 'జుమ్లా' ప్రభుత్వాన్ని నడిపినందున చాలాకాలం పాటు అధికారంలో ఉన్నప్పటికీ బీజేడీ ప్రజలకు మేలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. వికసిత్ ఒడిశాని నిర్మించడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. 2036 నాటికి అభివృద్ధి చెందిన ఒడిశా లక్ష్యంతో రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రకటించారు. రాష్ట్ర బడ్జెట్‌ను ప్రజల బడ్జెట్‌గా అభివర్ణించిన ముఖ్యమంత్రి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొస్తామన్నారు. సామాజిక న్యాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అందరికీ వైద్యం, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత, మహిళలు, యువకులు, ఎస్సీలు, ఎస్టీలు, వెనుకబడిన తరగతులు, దివ్యాంగులు, వయో వృద్ధుల సాధికారతపై బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యతను కల్పించామని వివరించారు. గొప్ప వ్యక్తులు మరియు దిగ్గజ వ్యక్తులకు సముచిత గౌరవం ఇవ్వడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర గొప్ప సంస్కృతి, భాష మరియు వారసత్వానికి గౌరవ సూచకంగా ఆంగ్ల నామకరణాలతో కూడిన పథకాలకు ఒడియా పేర్లు పెట్టడం జరిగిందన్నారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

- అనుమానాలు ఉన్నాయంటున్న కుటుంబ సభ్యులు
- అధికారులను నిలదీసిన దళిత సంఘాల నాయకులు





కిటికీకి వేలాడుతున్న అక్షిత మృతదేహం (ఇన్‌సెట్లో) అక్షిత (ఫైల్)

నందిగాం: స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలిక ల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్న లిమ్మక అక్షిత (16) మంగళవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రిన్సిపాల్ దమయంతి, నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం పారాపురం సమీపంలోని మహసింగి గ్రామానికి చెందిన లిమ్మక గిరి, శ్రావణిలకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె అక్షిత జూలై 24న జరిగి న రెండో విడత కౌన్సిలింగ్‌లో నందిగాం బాలికల గురుకులంలో ఇంటర్మీడియెట్‌లో చేరింది. 26వ తేదీన హోమ్ సిక్ అంటూ ఇంటికి వెళ్లి మరలా 29న గురుకులానికి వచ్చింది. యథావిధిగా తరగతులకు హాజరైంది. మంగళవారం రాత్రి 9.30 గంటల వరకు స్టడీ అవర్‌లో చదివి అందరితో పాటు నిద్రపోయింది. బుధవారం వేకువజామున సెక్యూరిటీ గార్డులు వచ్చి విద్యార్థులను నిద్రలేపుతుండగా 6వ తరగతికి చెందిన వనగాల్ల పల్లవి టాయ్‌లెట్‌కు వెళ్లగా పక్కనే ఉన్న కిటికీకి అక్షిత వేలాడుతూ కనిపించింది. వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి చెప్పడంతో వారు ప్రిన్సిపాల్‌కు సమాచారమిచ్చారు. పక్కనే క్వార్టర్స్‌లో ఉన్న ప్రిన్సిపాల్ వచ్చి చూసి విషయాన్ని ఉన్నతాధికారులకు, నందిగాం ఎస్సైకు, తహసీల్దారు, విద్యార్థిని తల్లికి తెలియజేశారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీం వివరాలు సేకరించింది. మృతదేహాన్ని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

న్యాయం చేయాలి..

అనంతరం గురుకులానికి చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తాము వచ్చేవరకు మృతదేహాన్ని ఉంచకుండా ఆస్పత్రికి తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్, ఎస్సైలను నిలదీశారు. అక్షిత మృతిపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని తల్లి శ్రావణి, మేనమామ బాడ రవీంద్రబాబు డిమాండ్ చేశారు. మృతురాలి తండ్రి గిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతురాలి తండ్రితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పారు. అనంతరం దళిత హక్కుల పోరాట కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి అక్కురాడ లోకనాథం, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగాన తిరుపతి రావు, కులనిర్మూలన పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకరరావు, స్థానిక నాయకులు జద్యాడ జయరాంలు మాట్లాడుతూ బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులు అధైర్యపడవద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నందిగాంలోని అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన వైనంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు అధైర్య పడవద్దని, సమస్యలు ఉంటే హెచ్ఎంకు తెలియజేయాలన్నారు. కాగా, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతిశ్రీ పాఠశాలకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి మనోధైర్యం కల్పించారు.

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థిని ఆత్మహత్య ఉదంతంపై జిల్లా అధికారులు, గురుకులం జిల్లా కో–ఆర్డినేటర్‌లు త్వరితగతిన పూర్తి నివేదిక అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, బొల్లినేని మెడ్‌స్కిల్స్ (రాగోలు జెమ్స్) సంయుక్తంగా నిర్వహిస్తున్న కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్ (40 సీట్లు), ఏడాది పీజీ డిప్లమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ (40 సీట్లు)లో ప్రవేశాలు కల్పిస్తు న్నట్లు చెప్పారు. 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. రూ.250 దరఖాస్తు రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించి ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవా లని చెప్పారు. వివరాలకు 7995013422, 7680945357 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని అక్రమంగా తరలివెళ్తున్న ఇసుక లారీను బుధవా రం వీఆర్వోలు పట్టుకున్నారు. బట్టేరు నుంచి నేరుగా జాతీయ రహదారి వైపు తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు మాటువేసి అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు లారీని తరలించారు. ఈ దాడు ల్లో వీఆర్వోలు యశ్వంత్, గణేష్, లక్ష్మణావు, పాపారావు పాల్గొన్నారు.

పోలీసులూ.. ఇదేం తీరు!

- గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- పోలీసులే వచ్చి విడిచిపెట్టించిన వైనం



అనుమతులు లేకుండా తరలిస్తున్న గ్రావెల్ ట్రిప్పర్లు



వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రావెల్ తరలింపుదార్లతో మాట్లాడు తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల సమీపంలో రెండు ట్రిప్పర్లతో గ్రావెల్ అక్రమంగా తరలిపోతుండగా బుధవారం ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి రాంబాబు, సత్తారు గోపి, మొదలవలస కృష్ణారావు, సీపాన దిలీప్‌కుమార్, గురుగుబెల్లి మహేష్‌లతో కూడిన బృందం అడ్డుకుంది. ఎక్కడి నుంచి గ్రావెల్ తెస్తున్నారని ఆరాతీయగా.. చిలకపాలెం పంచాయతీ నారాయణపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 15/2, 3, 4 నుంచి తీసుకువచ్చినట్లు గుర్తించారు. తోటపాలేం పంచాయతీ పెయిలవానిపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి కోసం తీసుకెళ్తున్నట్లు డ్రైవర్‌లు తెలియజేశారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు మైనింగ్, రెవిన్యూ, పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అయినా అధికారులు స్పందంచ లేదు. అనంతరం ఎచ్చెర్ల ఎస్సై ఎస్.చిరంజీవితో కూడిన సిబ్బంది చేరుకుని ట్రిప్పర్లు విడిచిపెట్టాలని నాయకులకు చెప్పారు. విడిచిపెట్టకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో చేసేది లేక వదిలిపెట్టారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారికి పోలీసులు మద్దతుగా నిలవటం విమర్శలకు తావిచ్చింది.

డోలా ట్యాంక్ పరిశుభ్రం చేయాలని వినతి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పర్లాకిమిడి: ప్రతిఏటా డోలా ఉత్సవాలు జరుపుకునే స్థానిక డోలా ట్యాంకు చెరువును పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డోలా ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బినోద్ చంద్ర జెన్నా, కృష్ణచంద్ర పండా, ఇతర కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2003 నుంచి 2018 వరకు డోలా ట్యాంకు చెరువు రక్షణ, పరిశుభ్రత ఇతర అభివృద్ధి కార్యక్రమాలను మున్సిపల్ కౌన్సిల్ చేపట్టేది. అనంతరం కక్షిదారులకు అప్పగించిన పనుల వలన చెరువులో పిచ్చిమొక్కలు పెరిగి మట్టి కూరుకుపోయింది. దీనిపై జిల్లా కలెక్టర్ తగు చర్యలు చేపట్టాలని వినతి అందజేశారు.

పాఠశాలల్లో ఎన్నికల నగారా



ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ ఓటరుజాబితా తయారీలో కవిటి ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావు

కవిటి : ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 8న జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల షెడ్యూల్ ప్రకటన గురువారం వెలువడనుంది. జిల్లా వ్యాప్తంగా 2267 పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆగస్టు ఒకటో తేదీన ప్రకటన విడుదల చేస్తారు. వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచుతారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాల పరిధిలో ఎన్నికల్లో సభ్యులుగా ఎంపికైన వారు ఓటింగ్‌కు అర్హులు. ఐదు తరగతులు ఉన్న పాఠశాలలో ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున 15 మంది సభ్యుల్ని ఎంపిక చేస్తారు. ప్రతీ పాఠశాలలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను 15 మంది సభ్యుల నుంచి ఎన్నుకుంటారు. వీరిద్దరిలో ఒకరు కచ్చితంగా మహిళ ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది.

ఇదీ షెడ్యూల్..

1న నోటిఫికేషన్, 5న ఓటరు జాబితా అభ్యంతరాలు తెలియజేయడం, 8న ఎన్నికల నిర్వహణ, ఎస్ఎంసీ కమిటీ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ముగించడం, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లను ఎన్నుకుని ప్రమాణస్వీకారం చేయడంతో ప్రక్రియ ముగుస్తుంది.

నిబంధనలు ఇవే..

– ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు. ఒకరు తప్పక ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ అయిఉండాలి. మరొకరు బీసీ/ఈబీసీ/మైనారిటీ వర్గాలకు చెందిన వారై ఉండాలి. 50 శాతం ఓటర్లు (కోరం) తప్పనిసరి.

– ఒక క్లాసులో ఆరుగురు విద్యార్థులు లేకపోతే ఎగువ లేదా దిగువ తరగతిలో విలీనం చేసి సభ్యులు ఎన్నుకోవాలి.

– కమిటీ ఎన్నిక జరిపిన వెంటనే తీర్మానం రాసి ప్రమాణ స్వీకారం చేయించాలి.

– కమిటీకి అదనంగా ఆరుగురు ఎక్స్ అఫీషియల్ సభ్యులు ఉంటారు. వీరిలో సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ (మెంబర్ కన్వీనర్), మహిళా విభాగం నుంచి సీనియర్ టీచర్(మెంబర్), కార్పొరేటర్/కౌన్సిలర్/వార్డుమెంబర్, అంగన్‌వాడీ వర్కర్, ఫిమేల్ మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్, గ్రామైక్యసంఘం అధ్యక్షురాలు ఉంటారు.

టెక్కలిలో భారీ చోరీ

టెక్కలి రూరల్: టెక్కలిలో మంగళవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. ఇంటి యజమానిని పక్కకు నెట్టేసి బంగారం, వెండి ఆభరణాలు, మూడున్నర లక్షల సొమ్ముతో పరారయ్యారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి రోటరీ నగర్–1లో కర్రి వేణుగోపాలరావు అనే ఉపాధ్యాయుడు భార్యాపిల్లలతో కలిసి మూడు అంతస్తుల భవనంలో నివాసముంటున్నారు. కింద ఫ్లోర్ గోదాముకు అద్దెకు ఇచ్చారు. మిగిలిన రెండు ఇళ్లల్లో వేణుగోపాలరావు కుటుంబమే నివాసముంటోంది. మంగళవారం రాత్రి ఉక్కపోతగా ఉండటంతో ఏసీ సదుపాయం ఉన్న మూడో ఫ్లోర్‌కు కుటుంబ సభ్యులంతా వెళ్లి నిద్రపోయారు. ఇదే అదునుగా దుండగులు రెండో ఫ్లోర్‌లో ప్రవేశించి ఆభరణాలు, డబ్బులు మూటగా కట్టారు. ఆ సమయంలో ఏదో అలజడి వచ్చిందని గుర్తించిన ఇంటి యజమాని రెండో ఫ్లోర్‌కు వచ్చి చూసేసరికి ఓ దుండగుడు వేగంగా వచ్చి వేణుగోపాలరావును నెట్టేసి పారిపోయాడు. మరో వ్యక్తి బంగారం, వెండి, డబ్బు మూటలు పట్టుకుని ఫ్లోర్ పైనుంచి కిందకు దూకేశాడు. కొంతసేపటికి తేరుకున్న వేణుగోపాలరావు లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడాన్ని గుర్తించారు. అందులో సుమారు 12 తులాల బంగారం, కేజీన్నర వెండి ఆభరణాలు, రూ.3.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసునమోదు చేసినట్లు టెక్కలి సీఐ పైడయ్య తెలిపారు. కాగా, చోరీ జరిగిన తరువాత ఇద్దరు వ్యక్తులు నలుపు రంగు దుస్తులు వేసుకుని అయ్యప్పనగర్‌లో పరుగెత్తుకుంటూ వెళ్లడం చూశామని కొందరు స్థానికులు చెబుతున్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులో..

మరో ఘటనలో టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులో నివాసముంటున్న ఎం.ఢిల్లేశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తన భార్యతో కలిసి శ్రీనివాసనగర్‌కు వెళ్లి వచ్చిసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటం గమనించారు. అందులో బంగారం గొలుసు, రూ.7వేలు, మూడు జతల వెండి పట్టీలు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు తెలియజేసినట్లు బాధితుడు తెలిపారు.



వేతనాల లేమి

- మే నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వని కేంద్రం
- జిల్లాలో 1.65 లక్షల మంది వేతనదారులకు బకాయి
- పనులపై పడుతున్న ప్రభావం

హిరమండలం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి వేతన దారులకు కేంద్రం వేల రూపాయలు బకాయి పెడుతోంది. ఉపాధి పనులంటే గతంలో జాతరలా ఉండేది. గత పక్షం రోజులుగా ఈ పనులపై వేతనదారులకు ఆసక్తి తగ్గింది. ప్రతి రోజూ సగటున ప్రతి మండలంలో 6వేల నుంచి 10వేల మంది వేతనదారులు ఈ పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం ఈ పనులకు ఒక్కో మండలంలో సగటు 600మంది కూడా వెళ్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

చెల్లింపులకు బ్రేక్

జిల్లాలో 1,67,892 మంది వేతనదారులకు సుమారుగా రూ.204కోట్ల వేతనాలు అందాల్సి ఉంది. సుమారు ఆరేడు వారాలుగా ఉపాధి వేతనదారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. రోజుకు కనీసం రూ.300 వేతనం వస్తుందని చెప్పిన అధికారులు చెల్లించడంలో మాత్రం విఫలమయ్యారు. ప్రభుత్వం చొరవ కొరవడడంతో మే, జూన్, జూలై నెలల్లో పనిచేసిన వారికి ఇంతవరకు వేతనాలు అందలేదు. గతంలో ప్రతి 15 రోజులకు ఒక సారి వేతనదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమయ్యేది. ప్రస్తుతం దాదాపు ఆరేడు వారాల పాటు వేతనాలు మంజూరు కావడం లేదు. ఒక్కో వేతనదారునికి 35నుంచి 45 రోజులకు సంబంధించిన వేతనం అందాల్సి ఉంది. సగటున ఒక్కో కూలీకి రోజుకు రూ.200 చొప్పున లెక్క వేసుకున్నా సుమారు రూ.8 వేలు చెల్లించాల్సి ఉంది. వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో కొద్ది రోజులుగా వేతనదారులు పనులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. గతంలో వేలల్లో పనులకు వెళ్లే ప్రస్తుతం వందల్లోనే వెళ్తున్నారు. ఈ విషయమై ఎన్ఆర్ఈజీఎస్ హిరమండలం ఏపీఓ శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా బిల్లుల చెల్లింపులో జాప్యం వాస్తవమేనన్నారు.

జిల్లాలో ఉపాధి వేతనదారుల బకాయి వివరాలు

మండలం	వేతనదారులు	బకాయి (రూ.కోట్లలో)
ఆమదాలవలస	4044	5.10
బూర్జ	4790	5.90
ఎచ్చెర్ల	7509	9.70
జి.జిగడాం	5294	6.20
గార	8797	10.92
హిరమండలం	3124	3.75
ఇచ్ఛాపురం	2441	2.87
జలుమూరు	7501	9.40
కంచిలి	5449	6.45
కవిటి	2910	3.35
కోటబొమ్మాళి	7781	8.64
కొత్తూరు	7100	8.4
లావేరు	5563	6.38
ఎల్ఎన్‌పేట	4620	5.31
మందస	8197	10.48
మెళియాపుట్టి	6500	7.30
నందిగాం	6453	7.35
నరసన్నపేట	6230	7.28
పలాస	3483	4.31
పాతపట్నం	4700	5.33
పోలాకి	7248	8.68
పొందూరు	5371	5.72
రణస్థలం	8412	10.30
సంతబొమ్మాళి	7138	8.92
సారవకోట	6127	8.32
సరుబుజ్జిలి	3842	4.80
సోంపేట	3640	4.42
శ్రీకాకుళం	6563	8.11
టెక్కలి	4551	5.91
వజ్రపు కొత్తూరు	2514	2.89

ఇబ్బందుల్లో ఉన్నాం



ఆరువారాలు పనిచేసినా కూలి డబ్బులు అందలేదు. దీంతో పనులకు వెళ్లాలన్న ఆసక్తి ఉండటం లేదు. గతంలో 15 రోజుల్లో డబ్బులు పడేవి. ఇప్పటివరకు పనిచేసిన పనులకు డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది.

– వి.వనజాక్షి, ఉపాధి వేతనదారు, హిరమండలం

అంతా పెండింగే



ఉపాధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఏడు వారాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. గతంలో ఎప్పటి కప్పుడు బిల్లులు పడేవి ఇప్పుడా పరిస్థితి లేదు.

– బి.గంగాధరరావు, ఉపాధి వేతనదారుడు, గులుమూరు

త్వరలో బిల్లులు వస్తాయి



ఉపాధి పనులు చేసిన కూలీలందరకీ త్వరలోనే బిల్లులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వం వారం రోజుల్లో నిధులు విడుదల చేయనుంది. కూలీలు ఆందోళన చెందవద్దు. పనిచేసిన కూలీ సొమ్మంతా ఖాతాలకు జమవుతాయి. కూలీలు యథావిధిగా పనులు చేయాలి. – జీవీ చిట్టిరాజు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

రిజిస్ట్రేషన్ నిబంధనలకు తూట్లు

- పన్నులు ఎగ్గొట్టేందుకు టిప్‌ట్రిక్స్
- బీహెచ్ సిరీస్‌తో తిరుగుతున్న నాలుగు చక్రాల వాహనాలు
- పొరుగు జిల్లాలో పట్టుబడిన బలిజిపేట వాహనదారు



బీహెచ్ సిరీస్‌తో ఉన్న నంబరు

సాక్షి, పార్వతీపురం మన్యం: దేశంలో వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కొన్ని చిక్కులు ఉన్నాయి. ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనం..మరో రాష్ట్రంలో ఉన్నవారికి అమ్మినా, లేదా వేరే ప్రాంతానికి వాహన యజమాని మారినా అక్కడ రిజిస్ట్రేషన్ కోసం సమస్య ఏర్పడుతోంది. ఆ ఇబ్బందిని తొలగించేందుకు కేంద్రం కొత్తగా బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ విధానం ప్రవేశపెట్టింది. ఇది కాస్త దుర్వినియోగమవుతోంది. నూతన విధానంలో ఉన్న వెసులుబాటును ఉపయోగించుకుంటూ, కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ఈ సిరీస్‌ను పొందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఈ వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి. ఇటీవల బలిజిపేటకు చెందిన ఓ వ్యక్తి తన బీహెచ్ సిరీస్ కారుతో విశాఖలో పట్టుబడినట్లు అధికార వర్గాల భోగట్టా. దీంతో అక్కడి అధికారులు ఆ కారును సీజ్ చేశారు.

పార్వతీపురం నియోజకవర్గంలోని అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత వద్ద కూడా ఈ తరహా సిరీస్‌తో వాహనం ఉన్నట్లు సమాచారం. మరికొంతమంది కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది.

ఖర్చు తగ్గించుకోవచ్చు..
పన్నులు ఎగ్గొట్టవచ్చని..

మోటార్ వాహనాల చట్టం, 1988 సెక్షన్ 47 ప్రకారం వాహనాన్ని నమోదు చేయడం తప్పనిసరి. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం..ఒక రాష్ట్రంలో వాహనం కలిగి ఉన్న ఏ వ్యక్తి అయినా ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా తన వాహనాన్ని తిరిగి నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలి. సాధారణంగా ఇతర రాష్ట్రాల్లో తన వాహనాన్ని రీ-రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే..వాహన యజమాని మాతృ రాష్ట్రం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్..తప్పనిసరిగా సమర్పించాలి. దాన్ని పొందడం కోసం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తాను ఎక్కడ వాహనం రిజిస్ట్రేషన్ చేశాడో అక్కడికి వెళ్లి ఆ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో పాటు సమయం వృథా. దీంతో పాటు, వాహన యజమాని కొత్త రాష్ట్రంలో ప్రో-రాటా ప్రాతిపదికన అదే వాహనంపై మళ్లీ రోడ్డు పన్ను చెల్లించాలి. అప్పుడు అతను మాతృ రాష్ట్రంలో ఇప్పటికే చెల్లించిన రహదారి పన్ను వాపసు కోసం దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం ప్రక్రియ చాలా సుదీర్ఘంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో వాహన యజమాని బీహెచ్-సిరీస్ రిజిస్ట్రేషన్ కలిగి ఉంటే ఈ ఇబ్బందులేవీ ఉండవు. దీనికితోడు టోల్‌గేట్ల వద్ద కూడా ఎటువంటి రుసుములూ చెల్లించాల్సిన అవసరం ఉండదు.

రిజిస్ట్రేషన్‌కు చెల్లించాల్సింది ఎక్కువే..

బీహెచ్-సిరీస్ మొదటి రిజిస్ట్రేషన్ సంవత్సరంలో ప్రారంభమవుతుంది. బీహెచ్ అనే పదం చివర అల్ఫాన్యూమరిక్ అంకెలతో కనిపిస్తుంది(ఉదాహరణకు 24 బీహెచ్ 1212 ఏఏ). కారు కోసం రిజిస్ట్రేషన్ చేయించాలంటే దాదాపు రూ.3 లక్షలకుపైగా అవుతుందని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు. ప్రతి రెండు సంవత్సరాల కాలానికి మోటార్ వాహన పన్ను ఈ విధానంలో విధిస్తారు. రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 14 సంవత్సరాలు పూర్తయిన తర్వాత, మోటార్ వాహన పన్ను వార్షిక ప్రాతిపదిన విధిస్తారు.

వీరే అర్హులు..

వాస్తవానికి ఈ సిరీస్‌తో రిజిస్ట్రేషన్ అందరికీ ఇవ్వరు. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ప్రకారం..బీహెచ్-సిరీస్‌ను రక్షణ సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు(పీఎస్‌యూ) స్వచ్ఛందంగా అందుబాటులో ఉంటుంది. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వారి కార్యాలయాలు ఉన్న ప్రైవేట్ రంగ సంస్థల సిబ్బంది కూడా దీనిని పొందవచ్చు.

తనిఖీలు చేపడుతున్నాం..



బీహెచ్ సిరీస్ వాహనాలపై ప్రత్యేక తనిఖీ కొనసాగిస్తున్నాం. తగిన నిబంధనల మేరకే వాటిని వినియోగించాల్సి ఉంది. ఈ రిజిస్ట్రేషన్ నంబర్లతో జిల్లాలో తిరుగుతున్న వాహనాలకు సంబంధించిన యజమానులు వెంటనే పన్ను చెల్లించాలి. అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చు. లేకుంటే వాహనాలు సీజ్ చేస్తాం.

– ఎం.శశికుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి

జరుగుతున్నది ఇదీ..

ఒకే దేశం, ఒకే రిజిస్ట్రేషన్(వన్ నేషన్-వన్ రిజిస్ట్రేషన్)విధానంతో ఏర్పాటు చేసిన భారత్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను కలిగి ఉంటే.. అదే నంబరుతో దేశ వ్యాప్తంగా వాహనాన్ని వినియోగించవచ్చన్న ఆలోచనతో వినియోగదారులు ఉన్నారు. పన్నులను ఎగ్గొడుతున్నారు. బీహెచ్ రిజిస్ట్రేషన్‌తో పాటు, సంబంధిత రాష్ట్రంలో పన్ను చెల్లించి మాత్రమే వాహనాన్ని వినియోగించాలి. బీహెచ్ సిరీస్‌తో ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయితే ఆ వాహనాన్ని అదే రాష్ట్రంలో వినియోగించాలి. వాహనదారుడు తన వాహనాన్ని వేరే రాష్ట్రంలో ఉపయోగించాలనుకుంటే.. అక్కడి పన్ను విధానాన్ని బట్టి మోటార్ వాహనాల పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీనికి భిన్నంగా కొంత మంది అరుణాచల్‌ప్రదేశ్ లేదా ఇతర రాష్ట్రాలలో వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత రాష్ట్రంలో పన్ను చెల్లించి, ఆంధ్రప్రదేశ్‌లో మోటార్ వాహనాల పన్ను చెల్లించకుండా ఇక్కడ వాహనాన్ని వినియోగిస్తున్నారు. తద్వారా పెద్ద ఎత్తున ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారు.

క్లుప్తంగా

ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల


డీఈఓ జి.పగడాలమ్మ

పార్వతీపురం టౌన్: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రుల కమిటీల పేరును మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పు చేస్తూ ప్రస్తుత కమిటీల పదవీకాలం జూలైతో ముగియనుండడంతో ఆగస్టులో ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికకు ఆగస్టు 1వ తేదీన గురువారం ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని, మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఉంచుతారని, ఆగస్టు 5న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. అదే రోజు 3–4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. ఆగస్టు 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు

- ఎస్పీ వకుల్ జిందాల్


ఆత్మీయ వీడ్కోలు సభలో పాల్గొన్న ఎస్పీ వకుల్‌జిందాల్


విజయనగరం క్రైమ్: అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ టీకు మోహనరావు, బొబ్బిలి సీఐ సేపాన తిరుమలరావు, విజయనగరం రూరల్ హెచ్‌సీ పాండ్రంకి వాసుదేవరావును జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విధుల నిర్వహణలో వారి స్ఫూర్తిని కొనియాడారు. పోలీస్ ఉద్యోగంలో ప్రతిరోజూ కొత్తరకమైన సవాల్ ఎదురవుతూనే ఉంటుందని, దానిని సమయస్ఫూర్తితో ఎదుర్కొని, సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని, వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తానని ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐ ఈ.నరసింహమూర్తి, దిశ సీఐ బి.నాగేశ్వరరావు, పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐ సీహెచ్ రాజశేఖర్, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

సీతానగరం: మండలంలోని ఆర్.వెంకంపేట రైల్వే సమీపంలో పట్టాలు దాటుతున్న పి.పోలిశెట్టి (60) అనే వ్యక్తిని గుర్తు తెలియని ట్రైన్ ఢీకొట్టడంతో బుధవారం మృతి చెందాడు. దీనిపై రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన పి.పోలిశెట్టి చినభోగిలిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నప్పుడు రైల్వే పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ఘటనపై రైల్వే కీ మన్ అందించిన సమాచారం మేరకు ఎస్సై రవి వర్మ సంఘటనా స్థలంలో పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని బొబ్బిలి ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్తలు

కురుపాం: వానపాములతో ఎరువుల తయారీ (వర్మీ కంపోస్టు)పై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం ప్రారంభమయ్యాయి. అగ్రికల్చర్ స్కిల్ కాన్సెప్ట్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో 40 మంది యువతీ యువకులకు ఎరువుల తయారీపై నైపుణ్యశిక్షణ ఇస్తున్నారు. శాస్త్రవేత్త జి.అమృతవీణ వానపాముల రకాలు, ఎరువుల తయారీ విధానం, వానపాముల ఎరువుల కలిగే ప్రయోజనాలు, సేంద్రియ ఉత్పత్తులకు పెరుగుతున్న గిరాకీపై అవగాహన కల్పించారు. నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ ఎస్.శ్రవంతి, డాక్టర్ అనంత్ విహారి, ఉమా జ్యోతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి: పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆ క్రీడాకారులందరినీ బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు పరిచయం చేయగా ఆయన వారిని అభినందించారు. ఈనెల 2,3,4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో సబ్ జూనియర్, కేడెట్ విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయని కోచ్ తెలిపారు. పోటీలకు జె.జ్యోత్స్న ప్రియ, బి.వరలక్ష్మి, ఎస్.రోషన్, బి.హాసిని, పి.షర్మిల, ఎస్.జాజిలి, బి.ఆదిత్య, ఎస్.నిహాల్, ప్రవీణ్‌కుమార్, బి.శివరామకృష్ణలు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు కోచ్ చెప్పారు. కార్యక్రమంలో తైక్వాండో క్లబ్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, పి.రవికుమార్, డి.కల్యాణ్, టీమ్ మేనేజర్ కె.అభినవ్ పాల్గొన్నారు.

20 తులాల బంగారం, నగదు చోరీ


దొంగలు పగలగొట్టిన బీరువా

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామానికి చెందిన గంటనాగమణి ఇంట్లో చోరీ జరిగి 20 తులాల బంగారం పోయింది. ఈ ఘటనపై బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఆమె 15 రోజులుగా తన ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో బొబ్బిలిలో ఉంటున్న చెల్లెలు శ్రీదేవి ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతోంది. 1వ తారీఖున పింఛన్ అందుకునేందుకు బుధవారం ఆమె గ్రామానికి వచ్చి ఇంటికి వెళ్లిచూడగా వెనుక తలుపులు బద్దలు కొట్టి ఉండి, ఇంట్లో సామగ్రి అంతా చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరువాను పగలకొట్టి లాకర్‌లో ఉన్న 20 తులాల బంగారం, రూ.25వేలు దొంగలు దోచుకెళ్లారని వాపోయింది. ఏ రోజు దొంగతనం జరిగిందో తనకు తెలియదని న్యాయం చేయాలని పోలీసులను కోరింది. దీనిపై ఏఎస్సై భాస్కర్రావు మాట్లాడుతూ ఎంత బంగారం, డబ్బు చోరీ జరిగిందో స్పష్టత లేదన్నారు. ఒక్కోసారి ఒక్కో విధంగా బాధితురాలు చెబుతుండడంతో గందరగోళంగా ఉందని, ఫిర్యాదు మేరకు క్లూస్‌టీంతో ఆధారాలు సేకరిస్తున్నామని, ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారని ఏఎస్సై తెలియజేశారు.

సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణ కోసం సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సి ఉందని కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అన్నారు. సౌర విద్యుత్‌ను వినియోగించేవారికి కేంద్ర ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆయా కుటుంబాలు విద్యుత్ బిల్లులు ఆదా చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం క్రింద గృహాల్లో సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారికి గరిష్ఠంగా మూడు కిలో వాట్ల వరకు రాయితీ కల్పిస్తోందని తెలిపారు. ఒక కిలో వాట్ సామర్థ్యం గల యూనిట్‌పై రూ.30 వేల వరకు రాయితీ పొందవచ్చన్నారు. ఈ పథకం కింద ఇళ్లలో సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే ఆసక్తి గల వారు పీఎం సుర్యఘర్ యాప్ ద్వారా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం రూ.1000 రుసుం చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ లక్ష్మణరావు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్డీ అనిత, విద్యుత్‌శాఖ ఈఈలు పూడి హరి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకుడి ఆత్మహత్య

- అప్పులున్నాయంటూ సూసైడ్ నోట్


ఆత్మహత్యకు పాలపడిన రవికుమార్


రవికుమార్ (ఫైల్)

చీపురుపల్లి: ఎక్కడో పుట్టాడు, మరెక్కడో పెరిగాడు, తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఉన్నారో లేదో తెలియదు, నాలుగేళ్ల క్రితం చీపురుపల్లి వచ్చాడు. ఒంటరిగానే ఉంటూ అందరితో పరిచయాలు పెంచుకుని, మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకుని, అక్కడక్కడా అప్పులు చేసి ఎస్‌ఆర్‌కే వింగ్స్ అనే హోటల్‌ను నడుపుతున్నాడు. ఇంతలో ఏమైందో తెలియదు కానీ తాను నివసిస్తున్న ఇంటి వంట గదిలో శ్లాబ్ హుక్‌కు నైలాన్ తాడు కట్టి మెడకు చుట్టుకుని ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని కొత్తగవిడి వీధిలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చింతా రవికుమార్(42) అనే హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడడం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. సమాచారం మేరకు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు అక్కడి పరిస్థితులు పరిశీలించి ఆత్మహత్యకు పాల్పడడం వెనుక కారణాలు ఆరా తీసి, సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడే ముందు రాసిన సూసైడ్ నోట్, సెల్‌ఫోన్‌లో ఉన్న వీడియోను ఎస్సై స్వాధీనం చేసుకున్నారు.

చాలా మందికి డబ్బులివ్వాలి

ఆత్మహత్యకు ముందు రవికుమార్ సూసైడ్ నోట్ రాయడంతో పాటు తన సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డ్ చేశాడు. తాను చాలా మంది వద్ద అప్పు తీసుకున్నానని, వారందరికీ డబ్బులు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నాడు. తన ఇంటిలో రూ.50 వేలు ఉంచానని ఆ డబ్బులతోనే మాజీ వార్డు మెంబర్ గవిడి నాగరాజు ఆధ్వర్యంలో తన అంత్యక్రియలు జరగాలని కోరుకుంటున్నట్లు రాశాడు. సూసైడ్ నోట్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

కేసుల్లో దర్యాప్తు వేగవంతం



మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి

పార్వతీపురంటౌన్: వివిధ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు.ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని మల్టీఫంక్షన్ హాల్‌లో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, సారా అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, ఎస్‌ఈబీ అధికారులతో కలిసి దాడులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్ విధిగా నిర్వహించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలి

రోడ్డు ప్రమాదాల మీద ఎస్పీ మాధవ రెడ్డి సమీక్ష నిర్వహించి తగు నిర్దేశాలు జారీచేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తరువాత ఫారం-1,5,7 లను నింపి సంబంధిత పత్రాలను జతచేసి ఐరాడ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి రోడ్డు భద్రత నియమాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. వాహన తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై దృష్టిసారించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్బీ సీఐ లక్షణరావు, డీసీఆర్‌బీ సీఐ బి.ఎం.డి.ప్రసాద్, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, జిల్లా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బధిర పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

విజయనగరం టౌన్: స్థానిక ఫూల్‌బాగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 సంవత్సరానికి గాను చెవిటి, మూగ బాల,బాలికల ప్రవేశాలకు సంబంధించి ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకూ అడ్మిషన్లు ప్రారంభించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జె.దయానంద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఒకటో తరగతిలో చేరడానికి ఆరు నుంచి ఎనిమిదేళ్ల వయసు కలిగి ఉండాలన్నారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పాఠశాల బదిలీ సర్టిఫికెట్‌తో పాటు రైస్/రేషన్ కార్డ్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. ఎటువంటి ప్రవేశరుసుం, డొనేషన్‌లు లేవని, సుశిక్షితులైన ఉపాధ్యాయులతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ 9000013640, 9440437629 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముందస్తు టీకాతో ‘లంపి’ని పంపేద్దాం

- వ్యాధి ప్రబలకుండా పశుసంవర్ధక శాఖ చర్యలు
- జిల్లాలో ఆవులు, ఎద్దులు 2,28,681


సింగుపురంలో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ యంత్రాంగం


లంపి స్కిన్ వైరస్ సోకిన పశువు

పాలకొండరూరల్: పశువుల్లో సక్రమించే వ్యాధుల్లో అధికశాతం ముందస్తు జాగ్రత్తలతో నివారించదగ్గవే. జీవాలకు వ్యాధి రాకముందే టీకాలు, మందులను వైద్యుల సిఫార్సు మేరకు వాడడం వల్ల అనేక రకాల రోగాల నుంచి జీవాలు అధిగమించేలా పాడిరైతులు చూడవచ్చు. ఇటీవల మూగజీవాల్లో కనిపిస్తున్న లంపిస్కిన్ (ముద్దచర్మవ్యాధి) ప్రాణాంతకమైనదని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎద్దులు, ఆవుల్లో ఈ వ్యాధి సోకే ఆస్కారం ఉంది. ఈ వ్యాధి నివారణకు ఇప్పటివరకు కచ్చితమైన టీకా ఏదీ కనుగొనలేదు. మొదట్లో వ్యాధి తీవ్రతను బట్టి సాధారణ చికిత్స అందించేవారు. ఈ వ్యాధిపై గోట్‌ఫాక్స్ టీకా సమర్థవంతంగా పనిచేస్తోందని పశుసంవర్ధక శాఖ గుర్తించింది. జిల్లా పరిధిలో 2,74,898 సంఖ్యలో పశు సంపద ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రెండేళ్ల క్రితం ఒడిశా రాష్ట్రంలో ఈ వ్యాధి ఉధృతం కావడంతో పాడిసంపదను అక్కడి రైతులు, పెంపకందారులు అధికంగా నష్టపోయారు. దీంతో స్థానిక యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో ఉచిత టీకాలు వేస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాను ఆనుకుని ఉన్న ఒడిశా ప్రాంతం నుంచి పశువులను కొనుగోలు చేసినా, సరిహద్దు ప్రాంతాల్లో మేత, సంచరించిన పశువుల విషయంలో జాగ్రత్తలు అవసరమని వైద్యులు పేర్కొంటున్నారు. గత ఏడాది లక్షా 60వేల 823 పశువులకు టీకాలు వేసిన అధికారులు ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా ఈ ఏడాది 1,57,500 టీకాలు అందించేందుకు చర్యలు చేపట్టారు.

ఇంటి పట్టునే చికిత్స ఇలా..

ఇంటిపట్టున దొరికే సంప్రదాయ దినుసులతో ఆయుర్వేద చికిత్స పద్ధతులను రైతులకు జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ అందుబాటులోకి తెచ్చింది.

తయారీ ఇలా

తమలపాకులు 10, మిరియాలు 10 గ్రాములు, ఉప్పు 10 గ్రాములను దంచి లేపనం లాగా తయారు చేయాలి. ఈ లేపనానికి తగినంత బెల్లం కలిపి పశువుకు తినిపించాలి. మొదటి రోజున ఇలా తాజాగా తయారు చేసిన ఒక మోతాదు మందును ప్రతి 3 గంటలకొకసారి పశువుకు తినిపించాలి. రెండో రోజు నుంచి రెండు వారాల పాటు రోజుకు 3 సార్లు (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) తాజాగా తయారు చేసిన మందును తినిపించాలి.

- వెల్లుల్లి 2 పాయలు, ధనియాలు పది గ్రాములు, జీలకర్ర పది గ్రాములు, తులసి ఆకులు గుప్పెడు, బిరియానీ ఆకులు పది గ్రాములు, మిరియాలు 10 గ్రాములు, తమల పాకులు 5, ఉల్లిపాయలు చిన్నవి రెండు, పసుపు 10 గ్రాములు, నేలవేము ఆకుల పొడి 30 గ్రాములు, కృష్ణ తులసి ఆకులు గుప్పెడు, వేపాకులు ఒక గుప్పెడు, నేరేడు ఆకులు ఒక గుప్పెడు ఇంకా బెల్లం వంద గ్రాములు. ఈ మందును ప్రతిసారీ తాజాగా తయారు చేయాలి. అన్నింటినీ కలిపి దంచి లేపనంలా చేసి, దానిలో బెల్లం కలపాలి. మొదటి రోజు ప్రతి 3 గంటలకు ఒకసారి తాజా మందు తయారు చేసి పశువుకు తినిపించాలి. రెండో రోజు నుంచి ప్రతిరోజూ మందును తాజాగా తయారు చేసి రోజు పొద్దున, సాయంత్రం పశువు స్థితి మెరుగుపడే వరకు తినిపించాలి.
- జబ్బు సోకిన పశువు చర్మంపై గాయం ఉంటే అందుకోసం ప్రత్యేకంగా సంప్రదాయ పద్ధతిలో మందు తయారు చేసి పైపూతగా రాయాలి. కుప్పింటాకులు ఒక గుప్పెడు, వెల్లుల్లి పది రెబ్బలు, వేపాకులు ఒక గుప్పెడు, కొబ్బరి లేదా నువ్వుల నూనె 500 మిల్లీ లీటర్లు, పసుపు 20 గ్రాములు, గోరింటాకు ఒక గుప్పెడు, తులసి ఆకులు ఒక గుప్పెడు తీసుకుని మిక్సీలో వేసి రుబ్బి పేస్టులా తయారీ చేసుకోవాలి. గాయాలన్ని శుభ్రపరచి దాని మీద ఈ మందును పూతగా రాయాలి. గాయం మీద పురుగులు ఉంటే సీతాఫలం ఆకుల పేస్ట్ లేదా కర్పూరం, కొబ్బరి నూనె కలిపి రాయాలి.

వర్షాకాలం వ్యాప్తి..

లంపి స్కిన్ వ్యాధి ఏడాది పొడవునా ఎప్పుడైనా రావడానికి ఆస్కారం ఉంది. పశువుల్లో కాప్రిపాక్స్ వైరస్ కారణంగా లంపిస్కిన్ వ్యాధి సంభవిస్తుంది. ప్రస్తుత వర్షాకాలంలో పశువుల పాకల చుట్టూ నిలిచిన నీరు, మురుగులో వ్యాప్తిచెందే దోమలు, పురుగులు, జోరీగల తాకిడి వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఒడిశా సమీప, సరిహద్దు ప్రాంతాల్లో సంచరించే పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. సమస్యను గుర్తిస్తే ఆ పశువులను మంద నుంచి వేరుచేయాలి.

వ్యాధి జాడలు ఎక్కడా లేవు



జిల్లావ్యాప్తంగా లంపి స్కిన్ వైరస్ నియంత్రణలో ఉంది. పాడి రైతులు ఆందోళన చెందాల్సి అవసరం లేదు. వ్యాధి లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఈ వైరస్ కారణంగా మనుషులకు ఎలాంటి ఇబ్బంది లేదు. జిల్లా పశుసంవర్ధక శాఖ పరిధిలో 4 ఏరియా ఆస్పత్రులు, 38 పశువైద్యశాలలు, 35 గ్రామీణ పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. తద్వారా 26 మంది వైద్యులు ఈ ఉచిత టీకాలు అందించే ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం 15 మండలాల్లో 85.30 శాతం వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేశాం. మరో 23,154 టీకాలు వేయాల్సి ఉంది. వ్యాధి సోకక ముందే టీకా వేయిస్తే సమస్య ఉండదు.


డాక్టర్ శివ్వాల మన్మథరావు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

సత్యహరిశ్చంద్ర విగ్రహావిష్కరణ


సత్యహరిశ్చంద్ర విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని స్వర్గధామం వద్ద సత్య హరిశ్చంద్ర విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. డాక్టర్ వాడాడ గణేశ్వరరావు, కమిటీ సభ్యులు తాతాజీ, సాంబమూర్తి, చంద్రశేఖర్, షణ్ముఖ ముత్యాలు, శ్రీనివాసరావు తదితరులు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం శిల్పి సుబ్బారావును సత్కరించారు.

దిశ డీఎస్పీ హరిత బదిలీ


దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా దిశ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్సార్ హరితను తిరుపతి డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో తొలి దిశ డీఎస్పీగా ఆమె విధులు నిర్వహించారు. దిశ యాప్ డౌన్‌లోడ్, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మహిళల రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు.